# మెఱపులు: సాంఘిక దోషములు

- వేమూరి వేంకటరామనాధం

ఏప్రిల్ 2009 నాటి ఎ.ఎఫ్.ఐ.సి.యస్. బులెటిన్ (యునైటెడ్ నేషన్సు మాజీ ఉద్యోగుల సంఘం వారు న్యూయార్కు నుండి ప్రచురించే త్రైమాస పత్రిక) లో ఒక విశిష్టమైన అంశం నా మనస్సు నాకర్షించింది. సెక్రటరీ జెనరల్ బాన్‌కీ-మూన్, మహాత్మాగాంధీ బోధలలో తనకు ప్రత్యేకంగా నచ్చి, తన ప్రవర్తన క్రమంలో పాటించ నిశ్చయించిన సూక్తి యొకటి తెలియజేశారు; ఏడు సాంఘిక దోషములను పేర్కొని, అవి తన నంటకుండా ప్రయత్నిస్తున్నాను, అని ఆయన తెలియజేశాడు. ఇది ఎంతటి చక్కటి అంశమో, గమనించండి. ఆ దోషములీ విధంగా పేర్కొనబడినాయి.

పరిశ్రమ లేని కలిమి

వివేకం లేని ఆనందం

శీలం లేని విజ్ఞానం

న్యాయంలేని వ్యాపారం

మానవత లేని శాస్త్రం

త్యాగం లేని మతం

నీతి లేని రాజకీయం

ఒక విధంగా ఇవి సత్ప్రవర్తనలోని అంశాలుగా మనకు గోచరిస్తాయి. ఒక్కొక్కటి కొంచెం లోతుగా పరిశీలిస్తే వీటిలోని అంతరార్థం మన హృదయానికి తట్టుతుంది. అంతేకాదు, నేటి ప్రపంచపరిధిలో - 'మొదటిది' లేని 'రెండవది' ఎంత విస్తృతంగా ఉన్నదో మనకు తెలుస్తుంది.

సూక్ష్మంగా చెప్పవలెనంటే, మానవునికి - స్వీయజీవనంలో కాని, సాంఘిక సందర్భంలో కాని వలసిన సద్గుణమొకటి లోపించి, తన ఐహిక సుఖం ఏదో విధంగా సంభవించటం దోష భూయిష్టమని, నిజానికి "పాప"మని మహాత్ముడు వచించాడు. ఈ ఏడు ఉప శీర్షికల క్రింద ఎన్నో మౌలికమైన యధార్థాలు ఉన్నాయి. అది కొంతగా విశ్లేషించటమే ఈ వ్యాసంలోని మెఱుపు.

తన పరిశ్రమ లేకుండా, అనగా తన పరిశ్రమకు సరసమైన విధంగా కాకుండా, తన సత్ప్రవర్తనకు మాత్రమే ఫలితంగా కాకుండా, సంక్రమించిన ఐశ్వర్యం ఒక సాంఘికలోపం లేక దోషంగా మహాత్ముడు వక్కాణించాడు. జాగ్రత్తగా పరిశీలిస్తే, మానవునికి దక్కవలసిన భాగ్యం తన స్వీయకృషివలన నే కలగాలి, అనగా తన కృషికి తగినట్లుగా అది ప్రాప్తించాలి. ఈ అంశం జాగ్రత్తగా, విమర్శాత్మకంగా, అర్థం చేసికొంటే, మానవునకు దక్కవలసిన కలిమి తన శ్రమకు మాత్రమే ఫలితంగా ఉండాలి యని, తన శ్రమ యొక్క విరివిని బట్టి, సాంఘికంగా దానికి గల విలువను బట్టి, తనకు ప్రతిఫలం దక్క వలెనని, మనం గ్రహించాలి. స్వయంకృషికి సంబంధం లేకుండా సంక్రమించే కలిమి సాంఘిక దోషాలలో ఒకటి యని పై సూక్తిలోని అంతర్భావం. ఇది చాల కష్టదాయకమైన సూక్తియే. ఒక విధంగా ఆలోచిస్తే, వంశపారంపర్యంగా వస్తున్న "ఆస్తి"యన్నది సాంఘిక దోషం క్రిందకు వస్తుంది. వ్యక్తుల సాధారణ సాంఘిక జీవనక్రమం బట్టి, సంఘం తరతరాలుగా - దృఢంగా ఉండవలసిన ప్రజావసరం బట్టి ఈ సూక్తికి నిత్యజీవనక్రమంలో కొంత అదుపు వలసి యుంటుంది, అనిపిస్తుంది - నిక్కమైన కమ్యూనిష్టు సంఘక్రమంలోనే కాకుండా (అలాంటి క్రమం ప్రజాబాహుళ్యం యొక్క నిరసనతోనే భేదింప బడింది గదా, సొవియెట్ రష్యాలో!) మఱి, దైనిక్రమం లో ఈ నీతికి ఎలా పట్టం కట్టగలం, అన్న ప్రశ్న చాల కటువైనది. అర్థశాస్త్ర రీత్యా, సమాధానం అంత అదృశ్యం కాదు. స్థూలంగా, ఒక వ్యక్తి సంపాదన క్రమం -న్యాయసమ్మతమైన వఱకు - అరికట్టకుండా (అది అవినీతి భూయిష్టం, దోషసంబద్ధం కానంత వఱకు) దానిలో తనకు మిగిలే మొత్తం గూర్చిన "పన్ను" విధానం క్రమంగా "దారుణం" గా నిర్మించవచ్చు. చిన్న మొత్తాలు సంపాదించే వారి మీద నూటికి ఏ అయిదో పదో పన్నులుగా పన్నినా, ఆర్జన మట్టం పెరిగిన కొలది యీ పన్నులక్రమం కూడ - వివిధరీతులలో హనుమంతుడి తోకలాగా - విజృంభించి, చివరకు నూరుడాలర్ల సంపాదన మీద ఏ 80 సెంట్లో ఇంకా ఎక్కువో ప్రభుత్వం పన్నుల తంత్రంలో రాబట్టవచ్చును. అయితే రెండు అంకుశాలున్నాయి. ఒకటి, ఈ పన్నుల పన్నుగడ వ్యక్తుల సక్రమమైన పనితనాన్ని, పరిశ్రమాభిలాషను, నీరసింప జేసేట్లు ఉండరాదు. వారసత్వపు పన్నులీ దృష్ట్యా సఫలమని చెప్పాలి. సంపాదించినవాడు తన జీవితకాలంలో అనుభవిస్తాడు. సంపాదించని తన పిల్లలకు తన భాగ్యంలో కొంచెం మాత్రమే ప్రభుత్వం మిగిలిస్తుంది. స్వీయకృషి లేని కలిమి సాంఘికదోషమన్న మహాత్ముని సూక్తి సార్థకంవుతుంది.

అయితే, అలాంటి ప్రభుత్వ చర్యలు ఎంతవఱకు సార్థకం అవుతాయో నిజజీవనంలో, అన్నది మఱొక ప్రశ్న. అన్ని దేశాలలోను ప్రభుత్వాలు ఈ పన్నుల పద్ధతులను ఎంత తీవ్రంగా అనుసరించగలవు

అన్నది మనం గమనించవలసిన వాస్తవిక ప్రశ్న. దీనికి పరిష్కారం ఆయా దేశాలలోని రాజకీయ పక్షాల పరస్పరబలాలను బట్టి కొంతవఱకు ఉంటుంది. అంతేకాదు, పన్నుల వలకు చిక్కకుండా ఆదాయాలను ఆస్తులను దాచుకొనగల అవకాశాలు కొన్ని దేశాలలో ఎక్కువగా ఉంటాయి. మంత్రివర్గాలలోని వారికే ఈప్రకర్తన అవసరం అయిన పక్షంలో ఈ వాక్యం ప్రత్యేకంగా అర్థవంతం అవుతుంది. ప్రపంచంలో ఎన్నో దేశాలు ఈ అవకాశపు సదుపాయంలో ఇఱికి ఉన్నాయి. ప్రభుత్వం తమ చేతిలో గల ఖామందులు తమ ఆస్తులకు సంపాదనలకు లోటు కల్గనట్లు, అవి - పట్టుబడకుండా దాచుకొనగల్గునట్లు, ఎన్నో ఉపాయాలు పన్నుతారు. సాధారణంగా వివిధ పక్షాలలోని నాయకులందఱకు ఈ అవసరం సాధారణమైన కారణంగా ఈ పన్నుగడల వలను త్రెంచటం తేలికగా సాధ్యం కాదు, ఎన్నో దేశాలలో.

మానవ స్వభావం - పైనుండి గట్టి కట్టుబాటు లేకపోతే - ఎలా కలిమిదొంతరల ఆర్జనలో నైపుణ్యం వహిస్తుందో గమనించవలెనంటే, కమ్యూనిజం రూపుమాసిన రష్యానే తీసికొనవచ్చును, ఉదాహరణ ప్రాయంగా. వెనుకటి కట్టుబాట్లు తొలగిన కొలది దినాలలోనే ప్రజల మధ్య సంపదవైవిధ్యం విపరీతంగా పెరిగిపోయింది. అలాంటిది సంభవించకుండా తీసుకొనవలసిన జాగ్రత్తలకు ప్రభుత్వ రీత్యా - కమ్యూనిజం నాడు వలె - బలం క్షీణించింది. ధనం సేకరించటం - ఏ మార్గాననైనా - వృత్తిగా పెట్టుకొన్న వ్యక్తులజట్లు క్రమంగా ఆర్థిక విధానంలో వేళ్ళు నాటి "పరిశ్రమ" లేకుండా కలిమి నార్జించే సూక్ష్మమార్గాలు అవలంబించటం కూడ మనకు విదిత మవుతుంది.

పరిశ్రమకు కలిమికి గల సంబంధం గుఱించి మఱింత లోతుగా తర్కిస్తే ఒక విషయం మనకు గోచరిస్తుంది. పరిశ్రమకు తగినట్లు కలిమి సంభవిస్తుందా మన సంఘము తీరులో, అన్న ప్రశ్న రేకెత్తుతుంది. ప్రతి కార్మికవర్గానికి తగినట్లుగా కలిమి సమకూరుతుందా, లేక కొందఱకు బహుళంగా సంక్రమిస్తుందా? ఇక్కడ పరిశ్రమ అన్న పదానికి మనం ఊహించే అర్థం చాల ముఖ్యమైన తార్కికాంశం. కొందఱి పని చేతులతో - కార్మికులవలె గాక, బుద్ధితో, ఆలోచనతో, ముందుచూపుతో సంబంధించి యుంటుంది. అంతేకాక "అదృష్టం" అన్న అదృశ్యపరిస్థితి మీద కూడ అది ఆధారపడి యుంటుంది. దాని వలన కలిగే కలిమికి, అది దక్కిన వ్యక్తియొక్క పరిశ్రమకు గల సంబంధం ఒక ప్రత్యేక కోణంలో మనం గుర్తించ వలసి యుంటుంది. ఈ కోణంలో "అదృష్టం" అన్న అంశం ఒకటి ఉంటుంది. కొందఱి "పని" వలన అదృష్టం కలిసి వస్తే కలిమి మిక్కుటంగా లభిస్తుంది. అదే తీరున మఱొకడు ఎంత కష్టించినా, అంత కలిమి కలుగక పోవచ్చును. కలిమి కలగటానికి పరిశ్రమ ముఖ్యం నిజమే కాని, దాని వైశాల్యానికి ఒక్క పరిశ్రమయే కాక ఆర్థికవ్యవస్థలోని (మార్కెట్లోని) ప్రత్యేకతలు, అంతకు మించి - ఇది యది యని మనం నిర్వచించలేని అదృష్టం- "కలిసిరావటం" - ఎంతో ప్రాముఖ్యం కల్గి యుంటాయి.

ఈ చర్చ ముగించే ముందు ఒక నిశితమైన అంశం గమనించుదాం. ఒక వ్యక్తికి - మఱొక వ్యక్తి కన్న - ఎక్కువ కలిమి లభించటం సూటిగా వారి పరిశ్రమలలోని భేదం వల్లనని మనం నిర్ణయించలేము. ఒక్కొక్కప్పుడు తనకు తెలియని పరిస్థితిగా తన కలిమిలో అనుకొననంత వృద్ధి లభించవచ్చును. ఒక ఉదాహరణ: స్టాక్ మార్కెట్‌లో పై ఊపుల వలన - తన పెట్టుబడి పత్రాల విలువలు విపరీతంగా పెరగటంవల్ల - తన కలిమిలో అనుకొనని ఉన్నతి కల్గవచ్చును. (విరుద్ధ సంఘటనలు కూడ సంభవమే, కాని మనం ప్రస్తుతం తనకు కలిమి కలిగించే పరిస్థితులను గూర్చి చర్చిస్తున్నాము.) తన ఆస్తిలోని పెరుగుదలకు కొన్ని సందర్భాలలో తన పరిశ్రమ మాత్రమే కారణం కాకపోవచ్చును. మఱి ఆ విధంగా సంక్రమించిన సొమ్ము సాంఘిక దోషం క్రిందకు వస్తుందా, అన్నది చర్చనీయాంశం. ఇలాంటి తెగని సమస్యాపరిస్థితులను గుఱించి ఒక సమాపనం సూచించవచ్చును. ఆస్తి విపరీతంగా పెరుగుతున్న పరిస్థితిలో - అందులో నికరంగా తన ప్రత్యక్ష ప్రయత్నంలేని సందర్భంలో -సంఘం యొక్క, లేక ప్రభుత్వం యొక్క ప్రతి చర్యలు విపులీకరించక ముందే, ఆ కలిమి కలుగుతున్న వ్యక్తి సరసబుద్ధి తో అందులో కొంత భాగం సంఘానికి ఉపయోగం కలిగే ప్రయత్నాలలో వ్యయంచేయ సంకల్పించ వచ్చును, నిజానికి అలా తాను చేయుటం సంఘానికేకాక, తనకు సంఘంలోను, ప్రభుత్వం సమక్షంలోను గల స్థానం పెంపు చేయటంలో ఉపయోగపడుతుంది. మన ప్రధాన తర్కంలో ఇక్కడి మలుపు ఏమంటే అది - అనగా అలా తనకు కలిమి కల్గటం లేక హెచ్చుటం సాంఘిక దోషమా, అన్న ప్రశ్నను ప్రక్కకు త్రోసి పెట్టి, ఆప్రశ్నకు సమాధానం కోసం వ్యర్థప్రయత్నం చేయకుండా, ఫలితాల దృష్ట్యా అలాంటి కలిమిపెంపు సంఘానికి ఉపయోగకరంగా ఉండటానికి మార్గము లేదా యన్న ప్రశ్న ప్రధానాంతరంగా మనం గమనించవచ్చును. ఏ వ్యక్తి పరిశ్రమకు ఎంత ప్రతిఫలం రావలెనో, సవ్యమో ఎవరెఱుగుదురు? ఉదాహరణకు వ్యాపారంలో పెట్టుబడి పెట్టినవానికి కలిమి ఎంతగా తిరిగి దక్కవలెనో ఎవరు నిర్ణయించగలరు? కేవలం వడ్డీ మొత్తం కన్న అది ఎంత ఎక్కువగా పరిస్థితులలో దాని సవ్యతను గూర్చిన చర్చ చాల క్లిష్టం అవుతుంది. కాని ఆ "అతి" లేక విపరీత లభ్యత యొక్క నిక్కమైన

ఉపయోగం ఏకొంతగానైనా సాంఘికప్రయోజనం కోసం వినియోగమయితే దానిలోని "సాంఘికలోప" భారం తగ్గుతుంది. ధనవంతులు, భూరిపరిశ్రమదారులు, సాంఘిక ఉయోగం కోసం తమ రాబడిలో కొంతభాగం వినియోగించటం ఈ విధంగా ఆ ఆర్జనలోని నైతిక సమస్యలను కొంతగానైనా తగ్గిస్తుంది. ధనికులు బహుళంగా వ్యాపారము పెట్టుబడులనుండి ఆదాయాలు దక్కించుకొనే వారు, ఎందటో సాంఘికక్షేమ కారకమైన ఈవిని అవలంబించటం మనం గమనిస్తూనే ఉన్నాము గదా. తమకు గిట్టక మొత్తంలో ఎంత ఎక్కువ, లేక తక్కువగా, వారిలా సాంఘిక క్షేమకరమైన వ్యయాలు చేస్తారు అన్నది ముఖ్య ప్రశ్నకాదు. సిద్ధాంతదృష్ట్యా వారి ఆచరణలు సాంఘిక క్షేమానికి దోహదమయ్యే వ్యయాలవైపు మొగ్గుతున్నవని, వీటి వలన తమకు ఆర్థిక లాభం సూటిగా రాదని, తమ వ్యాపారపు పెట్టుబడులకన్న ఈ వ్యయాలు భిన్నమైన తరగతికి చెందుతాయని, ఇవి ఆచరణలో ప్రముఖంగా నిర్వహించే వ్యక్తులకు మహాత్ముడు సూచించిన సాంఘికదోషం లేక పాపం కొంచెంగానైనా తొలగగలదని మనం ఊహించవచ్చును. ముఖ్యంగా, ఒక మానవునకు ఎంతవఱకు తన శ్రమకు గాని పెట్టుబడికి గాని ఆదాయం రావటం సవ్యమో, ఎంతకు మించి అది అపవసవ్యమో - లేక పాపసంకలితమో, ఇతమిద్ధమని చెప్పటం కష్టం. కాని ఆర్జించిన సొమ్ములో ఎంతగా సంఘానికి తిరిగి ఏదో మార్గంలో - గమ్మత్తుగా తిరిగి తనకు ఆదాయం వచ్చే మార్గంలో కాక - తాను సమర్పిస్తాడో , అన్నది చాల ముఖ్య ప్రశ్న.

సూటి సమాధానం లేని అనేక సాంఘిక ప్రశ్నలలో ఇదొకటి, ఒక మానవునకు తన శ్రమకు గాని, పెట్టుబడికి గాని, ఎంత ప్రతిఫలం దక్కవలెను అన్నది. కేవలం కాయకష్టం కాక, బుద్ధి బలం మీద ఆధారపడిన పరిశ్రమల పట్ల ఈ ప్రశ్న మఱింత కష్టమైన దవుతుంది. ఇంతే కాక, అదృష్టం వలన తనను వైయక్తికంగా మించిన ఆర్థిక వ్యవస్థ వలన, లభ్యమయ్యే రాబడులను గూర్చి సూత్రీకరించటం ఇంకా కష్టం.

ఈ తికమకలో వెలుగు కోణం ఒకటే - పైన సూచించినది: లభ్యమైన ఆదాయంలో ఎంత భాగం తిరిగి సాంఘిక ప్రయోజనాల కోసం తాను ప్రత్యేకిస్తాడు, అని.

ఈ వ్యాసం తొలిలో సూచించిన ఏడు అంశాలలో మొదటి దాని మీదనే యింత చర్చకు అవకాశం, అవసరం ఉన్నాయి, మిగత వాటిపైన చర్చకు వాయిదా!

******